# ప్రొడ్యూసర్ భద్రం

"శంకరం బాబూ! శంకరం బాబూ!"

శంకరం తాను చదువుతున్న పత్రికను మడిచి పక్కన పెడుతూ, "లోపలికిరా, భద్రం" అన్నాడు.

శుభవార్త తెస్తున్న వాడల్లే భద్రం నవ్వు మొహంతో లోపలికొచ్చి మూలనున్న స్టూలు లాక్కుని శంకరానికి పక్కవాటంగా కూర్చున్నాడు.

"ఏమిటి విశేషం, భద్రం? పెద్ద పనిమీదే వచ్చినట్టున్నావు" అన్నాడు శంకరం. భద్రం బుర్ర వెనుకభాగం తడువుకుంటూ, అలిగిన హీరోయిన్‌లాగా ఒళ్ళంతా ఒక్కసారి ఆడించి, "ఏం పెద్దపన్లేండి? పెద్దదంటే మరి పెద్దదే. కాని మనం దాన్ని చిన్నదనుకోవాల. అప్పుడుగాని దయిర్యెంగా చెయ్యలేం, ఏది-?" అన్నాడు.

"నీ తస్సదియ్యా, వేదాంతివైపోతున్నావే" అన్నాడు శంకరం.

"యేదోవో దేవాంతం చెయ్యకపోతే మనం పైకొచ్చేదెట్టా గురూగారూ?"

శంకరం సిగిరెట్టుతీసి నోట్లో పెట్టుకుని వెలిగించి, భద్రానికి ఇవ్వబోయాడు.

"సిగిరెట్లు మానేస్తినిగా, శంకరం బాబూ? నీకు తెలవదెట్టా?" అంటూ భద్రం ఒక జేబులోంచి బీడీ, ఇంకో జేబులోంచి లైటరూ తీసి, బీడీ అంటించి, మునిపళ్ళ మధ్య బీడీని గట్టిగాపట్టి, కళ్ళు చికిలించి, ఏదో ఆలోచిస్తున్నట్లు కనబడ్డాడు.

"ఇంతకూ నువ్వు వచ్చిన పని చెప్పావు కావు" అన్నాడు శంకరం.

"మరేం లేదు. మీతో శానా యిసయాలు మాట్టాడాల. టైము పడద్ది. మీకు తీరిగ్గా ఉండే సమయం చూసి."

"ఇప్పుడు తీరికే మాట్టాడు" అని శంకరం ప్రోత్సాహం ఇచ్చాడు.

భద్రం ఆరిపోయిన బీడీని లైటరుతో వెలిగించి, 'మరేం లేదు. గురూగారూ. ఓ పిచ్చెరు తియ్యాలని!" అన్నాడు క్లుప్తంగా.

"పిక్చరా? ఎవరు?"

"ఎవరో అయితే మనకేం దురదా? శతదినోత్సవాలు చేసుకున్న పిచ్చెర్లలోనూ, యిడుదలవుతోనే గోయిందా గొట్టిన పిచ్చెర్లల్లోనూ సమంగా ఎగస్ట్రా యేసాలేస్తానే వుంటినిగా? మనవే తియ్యాల ఓ మంచి అవ్వల్ నెంబరు పిచ్చెరు!"

"మనవంటే నేకూడా అందులో ఉన్నానా యేం - కొంపతీసి!"

భద్రం చాలా అవమానానికి గురి అయినవాడి పోజుపెట్టి రోషంగా, నీకు నే వెనకదన్నున్నాను, అవటాంటే గాని ఈ భద్రంగాడు ప్రొద్దూసర్నంటూ ముందుగడు గేస్తాడండీ? నన్నింతకాలం వెరిక్కూడా బలేమాట సెలవిచ్చారే?" అన్నాడు.

"ఇదుగో, శంకరం బాబూ! ఈ భద్రంగాడంటే యేటనుకున్నారు? మీరు నన్ను పిలిచి, 'అరే, భద్రం! నీ కదా కమామీసూ నాకు నచ్చింది. నీ పదకం నచ్చింది. నీ శెటప్పు యావత్తూ నాకు నచ్చింది. పో, యెల్లు! మంచి పిచ్చెరు తీసి జనానికందించు! లచ్చులుచేసుకో!' అంటారు. కొండల్లే మీరుండగా నాకు భయవేటి, గురూగారూ?"

"నేను పెట్టుబడి పెట్టలేనే?"

"పెట్టుబడిదేంటిలెండి. ఏ లచ్చాదికారి సన్నాసైనా పెడతాడు. అదీగాక లాభాలు మన సరికిల్లోనే వుండాలని నా ఉద్దేశం. గవరై మామ ఓ కోపు కాస్తానన్నాడు."

"ఇందులో గవరయ్య మావ కూడా ఉన్నాడూ?"

"గవరై మావ లేకుండా పిచ్చెరు ఒక్క అడుగైనా ముందుకేస్తుందా? మావ వందమంది పెట్టుకాదూ? ఓ పది పదిహేనువేలు చులాగ్గా పారేస్తాడు. ఇంకో అయిదో పదో కావాలన్నా ఏ యినప్పెట్టెలో దొరికేదీ తెలిసిన మొనగాడు, అదట్టా వుంచండి. మావకింద ఎలాటి మెరికల్లాటి కుర్రోళ్ళున్నారాని! ఒకటు పాటకి సిసింద్రీ, మరోడు మాటకి మతాబా, యీరో యేసానికి బుర్రిగాడి ముందెవరాగుతారండీ? మీరు బుర్రిగాణ్ణి చూళ్ళా? కళ్ళ మీదికి పడే జులపాలూ, డైమను మార్కు ముక్కూ మా ముచ్చటగా వుంటాడు. ఏదీ ఇంకోవారంలో యిడదల్లై వొచ్చాక మీ దగ్గిరికి తీసుకొస్తా. సినిమాల్లో చేరి లచ్చలు గడించి, ఇంజెక్సను బల్బులు కొనుక్కుని అమ్మాయిలతో సుకంగా ఉండక నీకీ జేబులు తడివే పనేంటిరా అని ఎన్నిసార్లో చెప్పా. 'యెదవ డబ్బు! డబ్బుకోసం జేబులు కొడతావా! చినబాబూ! అది ఆర్టు, ఆర్టు' అంటాడు. నాకు తెలవకడుగుతాను గురూగారూ, యీరో కట్టటం ఆర్టుకాదూ?"

"ఎందుక్కాదూ? అది నటన కన్నాకూడా పెద్ద ఆర్టు" అన్నాడు శంకరం.

"తరవాతా-బేబీ మీకు తెలుసుగా? నక్కులాంటి పిల్ల! కోటాయేసి నిలబెడితే లచ్చిందేవే! నవమోహిని! 'యీరోయినేస్తావే, పిల్లా' అంటి పిచ్చెరు రిలీజయాక డబ్బిచ్చే షరతుమీద యేస్తానంది. చాకులెండి!"

"అయితే స్టార్లనెవర్నీ బుక్కు చెయ్యటంలేదాయేం?"

"ఎందుకండీ టార్లూ? పదిహేనుమంది ఠార్లతో పది లచ్చలు తగలేసి రిలీజు చేస్తే మొదటి ఆటకే తెరలు చించినంత పని చేశారు. ప్రేచ్ఛకులు కొత్త మొహాలు చూపండని

గొంతెత్తి అడుగుతున్నారు. అసలు స్టారంటే ఎవరు, శంకరం బాబూ? ఎంటీఆర్ మొదట తెరమీద దిగినప్పుడు ఎవ్రా యీ అబ్బాయీ అన్నారు. యీనాడుఎంటీఆర్ యింటి ముందు రోజూ తీర్థప్రజ! మానవజనమెత్తగోరేవాడు మొదట పుట్టాల. స్టార్లూ అంతే!"

"నీవేదాంతం-! అయితే మరి స్టూడియో, టెక్నీషియనులూ?"

"గవరైమావ కింద ఆర్టు డైరెగటరూ, డాన్సు డైరెగటరూ ఉన్నారు. స్టూడియో ఏర్పాటు చూస్తున్నాలెండి. గొడ్లపాక స్టూడియో మూలపడిందిగా, దాన్ని బట్టీ పెరుమాళ్ళు చవగ్గా అద్దెకు తీసుకొని, అందులో ఓ మూల సరుకు తయారు చేస్తున్నాడు. అందులో మనం సూటింగు చేసుకోవచ్చు."

శంకరం ఆవలించి ఒళ్ళు విరుచుకుని, "ఏర్పాట్లన్నీ కట్టుదిట్టంగా చేసుకున్నావన్న మాట. శుభం! కానీ" అంటూ సంభాషణ పూర్తి అయిన లక్షణాలు ప్రదర్శించాడు.

"అసలు విషయం అట్టే వుండి పోయిందే, శంకరం బాబూ" అన్నాడు భద్రం కాస్తదీనంగా.

"అదేవిటి?" అన్నాడు శంకరం ఆశ్చర్యంగా.

"ఇంకేంవుందీ? కథ! ముఖ్యెంగా ఆయిసయమే మీసలహా కావాలి."

"అవును, ఆ సంగతే మరిచాను సుమా! ఏంకథ తీద్దామని? సోషలా, పురాణిక్కా, ఫోక్లోరా?"

"చవగ్గా తీయటం మనక్కావలసింది. అంచేత సీక్రెటేజంటు కథ తీద్దావంటాడు గవరైమావ. చోరీ నంబరు 111' అంటే ఎట్టా వుంటుంది, శంకరం బాబూ?"

"పేరులో ఏముంది? కథ బాగుండాలి."

"గవరైమావ ఓ కథ చెప్పాడు. నేను రాశా. అక్కడక్కడా అచ్చు తప్పులుండొచ్చు. కాస్త దీన్ని చూసి, మీ అభిప్పిరాయం చెబితే" అంటూ భద్రం లేచినిలబడి, తానుకూర్చున్న స్టూలుమీదనుంచి ఓ లావుబైండు పుస్తకం తీశాడు.

"ఇదంతా కథే? దీన్ని చదవటానికి ఎన్ని మాసాలు పట్టును? నాకు టూకీగా కథ చెప్పరాదూ?" అన్నాడు శంకరం.

"అట్టా చేసినా చెయ్యొచ్చు" అంటూ భద్రం బైండు పుస్తకాన్ని స్టూలుమీదపెట్టి, దానిమీద కూర్చుని, "నూటపదకొండున్నాడే - మంచి రేసులెండి! ఆడు రైలెక్కడంతో పిచ్చరు ప్రారంభమవుద్ది. ఆ ఫస్టుక్లాసు కంపార్టమెంటులో ఒక ఆడదే వుంటుంది. అదే యీరోయిను. అదీ ఏజంటే. నూట పదకొండు అమ్మాయి పక్కన కూర్చొని నడుం చుట్టూ చెయ్యేసి దగ్గరికి లాక్కుని, 'నీ ఒడిలో వెచ్చగా' అని పాట పాడతాడు. మన కత్తెర లింగం ఆ పాటను మంచి ఒడుపుగా రాశాడు. ఇనే వాళ్ళకి శివమెత్తి పోవల్సిందే."

"సెన్సారు వాళ్ళు తీసెయ్యమంటే?"

"ఇదివరకొచ్చిన పాటల్లోలేని మాటొక్కటీ అందులో లేదుగా. ఏ మొగమెట్టుకుని తీసేస్తారు శంకరం బాబూ?" అన్నాడు భద్రం కయ్యానికి కాలు దువ్వుతూ.

"తరవాత?"

"టిక్కట్టు కలెకటరొచ్చి 'టికెట్! టికెట్!' అంటాడు. యీరోయిన్ మీదికి ఒరిగి యున్న యీరో సరిగా కూకుంటాడు. యీరోయిన్ తన బట్టలు సరిచేసుకొంటుంది."

"టిక్కెట్టు కావాలా? ఇద్దరికీ కలిసి ఒక టిక్కెట్టు చాలా?" అంటాడు పురీష్.

"పురీష్ ఎవరు?" అన్నాడు శంకరం ఉలిక్కిపడి.

"ఆడేనండి, నూట పదకొండుగాడు. ఆడి అసలు పేరు పురీష్. తెలుగు పేరు పెడితే ఏంబాగుంటుంది చెప్పండి? యెంకట సుబ్బయ్య, రాధాకృష్ణమూర్తి, దశరద రామయ్యా అని యీరో కెట్టా పేరు పెట్టటం, గురూగారూ?"

"నిజమే. కానీ."

"అవటాంటూ యీరో జేబులో చెయ్యిపెట్టి సిగిరెట్టు లైటరు లాటిదితీసి, టుప్పు మనిపిస్తాడు. టిక్కెట్టు కలెగటరు కాస్తా చచ్చిపడిపోతాడు. అది గమ్మత్తు లైటరు – రహస్య పిస్తోలన్నమాట. లైటరు కొనే పనిలేదు. దీన్నే ఉపయోగిస్తాం" అంటూ భద్రం లైటరు తీసి బీడీ వెలిగించటానికి ప్రయత్నించాడు. అది వెలగలేదు. శంకరం నిప్పు అందిస్తూ "తరువాత?" అన్నాడు.

"తరువాత నూటపదకొండు చెయిను లాగి, రైలాపి, దిగి, చీకట్లో కలసి పోతాడు. ఆ తరువాత నూటపదకొండును ఒక ఓటల్లో ప్రవేసిస్తూ చూపిస్తాం. ఇంగిలీసు ఓటళ్ళుండవూ, అటువంటిది. ఆ పిల్లలు సర్వర్లుగా తిరుగుతుంటారు. నర్సుల డ్రెస్సువేసుకొని ఓ పక్క బాలురూముడాన్సు సాగుతూంటుంది. ఒక అమ్మాయి నూటపదకొండును చూడగానే చిన్న గది చూపించి అందులోకి తీసుకుపోతుంది. ఆ అమ్మాయే – యిరోయినన్నమాట.

" 'ఏంకావాలి?' అంటుందమ్మాయి. 'నువ్వు?' అంటాడు యీరో. యమ దయిలాగులెండి! అంటూ అమ్మాయిని ఒళ్ళో కూచోబెట్టుకుంటాడు. తరువాత చాలాసేపు ఆళ్ళమొహాలే చూపిస్తాం. ఆ మొహాల్లో ఆ భావాలను బట్టి అంతా అర్థమై పోవాలి! సెన్సారు నా కొడుకులంటుకోలేరు. తరువాత అమ్మాయి లేచి చిలిపిగా యీరో చెంపమీద కొట్టి 'అల్లరి పిల్లాడు' అని వెళ్ళిపోయి భోజనం తెస్తుంది. యీరో ఆవురావురున తినేస్తాడు. బట్లరు వచ్చి బిల్లిస్తాడు. యీరో జేబులోంచి పర్సుతీసి బట్లరు మొహాన కొడతాడు. పర్సు పేలిపోతుంది. అది చేతిబాంబు. ఆ చిన్నగది నిండా పొగ కమ్ముకుని వుంటుంది. పొగ విచ్చిపోయేసరికి బట్లరు చచ్చిపడి ఉంటాడు. యీరో ఉండడు."

శంకరం అటూ ఇటూ కదులుతూ "చివరకేమవుతుంది?" అన్నాడు.

"పిచ్చేరంతా ఇట్టాగే సాగుతుంది. చిట్టచివరకు - మీరు గనుక చెపుతున్నాను, నూట పదకొండు యీరోయిన్‌ను విదేశీ ఏజెంటుగా పట్టిస్తాడు. ఆడియన్సులు ఆవలించాల్సిందే."

"అంతా బాగానేవుందిగానీ, భద్రం, జాతీయత బొత్తిగా లేనట్టుందే?" అన్నాడు శంకరం.

"అదేం భయం లేదు శంకరం బాబూ. మన ప్రభుత్తవం ఇంతలో సినిమాలను జాతీయం చెయ్యమని చెప్పేశారుగా?"

టెలిఫోన్ మోగింది. శంకరం లేచివెళ్ళి మాట్లాడి యివతలికివచ్చి, "భద్రం, నాకు అర్జంటు పని వచ్చిపడింది. తరువాత మాట్లాడదాం. ఏం?" అన్నాడు.

***ముద్రణ: సుధ, మే 1967***